క్లుప్తంగా

భూ వివాదాల పరిష్కారానికే రీ సర్వే



భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ రమణ

సీతానగరం: జగనన్న భూ హక్కు – భూ రక్ష పథకం ద్వారా చేపట్టిన రీసర్వే వల్ల భూ వివాదాలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. మండలంలోని పణుకుపేటలో జరుగుతున్న రీసర్వేను డీటీతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. దశాబ్దాలుగా ఉన్న భూ వివాదాలను చెక్ పెట్టేందుకే ప్రభుత్వం రీసర్వే చేపట్టిందన్నారు. అనంతరం పూనుబుచ్చింపేటలో రీసర్వే ప్రక్రియలో భాగంగా రైతులకు అవగాహన కల్పించేందుకు గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో జిరాయితీ భూములు, ప్రభుత్వ భూముల వివరాలను గ్రామసభలో వివరించారు. డీటీ చిట్టెమ్మ, మండల సర్వేయరు ఎం.గౌరీశంకరరావు, రైతులు పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న దాతలు

బలిజిపేట: పెదపెంకిలో పేదలకు జమ్మల నారాయణమ్మ రెండో వర్ధంతి సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులు చీరలు, దుస్తులు శనివారం పంపిణీ చేశారు. పేదలకు ప్రతి ఒక్కరూ తమ వంతు సాయం అందజేయాలని వారు కోరారు. కార్యక్రమంలో నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవనాయుడు, జి.శ్రావణ్, కె.చందు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు బదిలీలు

సీతానగరం: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పని చేస్తున్న ఆర్.నాయుడు, హెచ్‌సీగా విధులు నిర్వహించిన దీసరి సాంబమూర్తి, కానిస్టేబుళ్లు వి.తిరుపతిరావు, కె.శంకరరావు, కె.రాములు బదిలీ కాగా వారంతా బదిలీ ఉత్తర్వులు తీసుకున్నారని ఎస్‌ఐ కె.నీలకంఠం తెలిపారు. వీరిలో ఏఎస్‌ఐ నాయుడు కొమరాడ బదిలీ కాగా, మిగతా వారంతా సాలూరు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. కురుపాం పీఎస్ నుంచి ఏఎస్‌ఐ ఎల్.శ్రీనివాసరావు సీతానగరం పీఎస్‌లో బాధ్యతలు చేపట్టారని తెలిపారు. పార్వతీపురం రూరల్ పీఎస్ నుంచి సోమేశ్వరరావు హెచ్‌సీగా బదిలీపై వచ్చారని అన్నారు.

వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పార్వతీపురం టౌన్: రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా రవాణా శాఖాధికారి సి.మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. వైద్యశిబిరంలో డాక్టర్ సీహెచ్ ప్రతాప్, డాక్టర్ పి.నారాయణరావు శిబిరానికి హాజరైన 400మంది డ్రైవర్లకు ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. ముఖ్యంగా డ్రైవర్లకు నేత్ర పరీక్షలు, బీపీ, సుగర్, శారీరక ధృడ పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంవీ ఇన్‌స్పెక్టర్ ఎం.శశికుమార్, అసిస్టెంట్ ఎంవీ ఇన్‌స్పెక్టర్లు జి.సత్యనారాయణ, ఎ. వరప్రసాద్, బి.కాశీరాంతో పాటు పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టిడ్కో చైర్మన్ అభినందనలు

పార్వతీపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 56 కులాల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన కార్పొరేషన్ చైర్మన్‌ల పదవీ కాలం మరో రెండేళ్లు పొడిగించడంపై టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అభినందించారు. ఈ మేరకు బీసీ కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్‌ను, దాసరి కార్పొరేషన్ చైర్మన్ రంగుముద్రి రమాదేవిని అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు



సంఘటన స్థలంలో తీవ్రగాయాలతో యువకుడు రాజు

వీరఘట్టం: మండలంలోని సీఎస్‌పీ రోడ్డులో వండవ సెంటర్ దగ్గరలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వాసు రాజు అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పాలకొండ మండలంలోని ఆర్‌బీఆర్ పేటకు చెందిన రాజు తన ద్విచక్ర వాహనంపై వీరఘట్టం వెళ్లి, తిరిగి ఇంటికి వస్తుండగా ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం అతడిని ఢీకొట్టింది. దీంతో కిందపడిన రాజుకు తీవ్రగాయాలయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు చికిత్స నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి క్షతగాత్రుడిని తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఉన్నత వైద్య సేవల కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం.

గృహ నిర్మాణాల్లో ప్రగతి సాధించాలి

- లేకుంటే చర్యలు తప్పవు..
- ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఎమ్మెల్యే జోగారావు హెచ్చరిక



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: గ్రామాలలో గృహ నిర్మాణాల విషయంలో స్థానిక నాయకులు, అధికారులు, ప్రజలతో సమన్వయంగా పనిచేసి అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే జోగారావు ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. విధి నిర్వహణలో అలక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆయన హెచ్చరించారు. ఎంపీడీఓ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి స్థలాలను కొనుగోలు చేసి అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తే వాటి నిర్మాణాలలో జాప్యం జరుగుతుంటే మీరేం చేస్తున్నారని ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ప్రశ్నించారు. మీరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రభుత్వ ధనాన్ని వృథా చేసిన వారవుతారని తెలిపారు. ఎమ్మెల్యే జోగారావు అడిగిన వివరాలకు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సరైన సమాధానాలు చెప్పలేకపోవడంతో ఆగ్రహించారు. సమీక్ష సమావేశానికి వచ్చేటప్పుడు సచివాలయ పరిధిలో వివరాలను పూర్తి స్థాయిలో తీసుకురాకుండా ఎలా వచ్చారని ప్రశ్నించారు. అసంపూర్తి నిర్మాణాలు ఉండకూడదన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు విధి నిర్వహణలో అవగాహన లేకుండా వ్యవహరిస్తున్నారన్నారు. మండలానికి 3,600గృహాలు మంజూరైతే ఇప్పటికి 1,061మాత్రమే గృహ నిర్మాణాలు జరుపుకోగలిగామన్నారు. మిగిలిన వాటి సంగతి ఏమిటని ప్రశ్నించారు. అసంపూర్తి గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయించాలన్నారు. గృహ నిర్మాణాలు పూర్తయినా బిల్లులు మంజూరు కాని వారు ఎవరు ఉన్నారు.. బిల్లులు అందని వారు ఎందరు ఉన్నారనేది పక్కాగా లెక్కలు చూసి వాటి సంగతి తేల్చాలన్నారు. గృహ నిర్మాణాల విషయంలో ఎవరు నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేది లేదన్నారు. వేసవికాలం సమీపిస్తున్న సమయంలో గ్రామాలలో నీటి ఎద్దడి ఎక్కడా ఉండకూడదని అధికారులకు సూచించారు. వివిధ గ్రామాలలో నీటి సమస్యలు ఉన్నట్టు ప్రజలు చెబుతున్నారని, వాటిని పరిష్కరించాలని తెలిపారు. సమావేశంలో ఎంపీపీ జి.నాగమణి, జడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, హౌసింగ్ పార్వతీపురం డీఈ ప్రసాదుబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ హనుమంతరావు, ఎంపీడీఓ భానుమూర్తి, తహసీల్దార్ సన్యాసిశర్మ, మండల పార్టీ అధ్యక్షుడు మురళీకృష్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల్లోకి సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ వారి సమస్యలు పరిష్కరించడానికి సచివాలయ ఉద్యోగులు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని జోగింపేట సచివాలయాన్ని ఆకస్మికంగా శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు వివరించాలని వారికి అందేలా చూడాలన్నారు. సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించి ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. సచివాలయ ఉద్యోగులు విధి నిర్వహణలో క్షేత్ర స్థాయికి వెళ్లేటప్పుడు లిఖితపూర్వకంగా గోడపై పొందుపరచాలన్నారు. పారిశుద్ధ్య పనులు నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈఓపీఆర్‌డీ కె.కుమారవర్మ, సర్పంచులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను మళ్లీ ఆశీర్వదించాలి



మెట్టువీధిలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారుకు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మనసారా మళ్లీ దీవించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పెదబోగిలి సచివాలయం – 2 పరిధిలోని మెట్టువీధి, గూడెంవీధి, మార్కెట్‌లో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏ విధంగా పంపిణీ చేస్తున్నారోనని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ ప్రజల పొందుతున్న లబ్ధి వివరించడానికి, ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసారని పేర్కొన్నారు. ప్రతీకుటుంబానికి నవరత్నాల పథకం ద్వారా ఇళ్ల స్థలాలు, మౌలిక వసతులతో కూడిన పక్కా గృహాలు, ఇంటింటి కుళాయిలు, రైతుభరోసా, వైఎస్సార్ ఆసరా, జగనన్న విద్యా దీవెన, జగనన్న విద్యా కానుక, కాపునేస్తం, రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలు పంపిణీ, పేదలందరికీ ఆరోగ్యశ్రీ పథకాలను అమలు చేశారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, ఎంపీపీ ప్రతినిధి బి.శ్రీరాములు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బి.చిట్టిరాజు. పెదబోగిలి – 1, 2 ఎంపీటీసీలు బి.కుసుమ, ఎస్.గౌరీ, ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి, పీఆర్ ఏఈ చంద్రమౌళి, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సబ్జెక్టు టీచర్ల కొరతకు చెక్



చిలకలపల్లి ఉన్నత పాఠశాలలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు

బలిజిపేట: పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతకు ప్రభుత్వం చెక్ పెట్టేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా తాత్కాలిక పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులను నూతనంగా అలాట్ అయిన పాఠశాలల్లో విధుల్లో చేరే విధంగా చర్యలు చేపట్టింది. త్వరలో జరగనున్న పబ్లిక్ పరీక్షల దృష్ట్యా ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరతను తీర్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టింది.

మండలంలో 7గురికి మార్పులు

మండలంలో ఏడుగురు ఉపాధ్యాయులకు పదోన్నతులపై మార్పులు జరిగాయి. అందులో అంపావల్లి నుంచి తెర్లాం మండలం, అజ్జాడ డీపీఈపీ నుంచి పార్వతీపురం మండలం, చిలకలపల్లి ఎంపీపీ పాఠశాల నుంచి నారాయణపురం ఉన్నత పాఠశాలకు, వెంగాపురం ఎంపీపీ నుంచి చిలకలపల్లి ఉన్నత పాఠశాలకు, బలిజిపేట ఉన్నత పాఠశాల నుంచి బొబ్బిలి మండలానికి, పెదపెంకి ఉన్నత పాఠశాల నుంచి తెర్లాం మండలానికి పదోన్నతులపై వెళ్లారు.

రూ.2,500 అలెవెన్స్

తాత్కాలిక సర్దుబాటు ప్రక్రియలో భాగంగా ఉన్నత పాఠశాలల్లో బోధన చేసే సబ్జెక్టు టీచర్లకు ప్రభుత్వం సబ్జెక్టు టీచర్ల అలవెన్సుగా రూ.2,500 చెల్లించనుంది. ప్రస్తుతం వారు పొందుతున్న వేతనానికి అదనంగా ఎస్టీఏను చెల్లిస్తారు. వీరు ప్రస్తుతం పని చేస్తున్న పాఠశాలల నుంచే వేతనాలు పొందనున్నారు. బదిలీ ప్రక్రియలో న్యాయపరమైన సమస్యల పరిష్కారం అనంతరం పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు శాశ్వత ప్రాతిపదికన స్థానాలు కేటాయించే అవకాశముంది. సర్దుబాటుకు గురైన ఉపాధ్యాయులు శనివారం విధుల్లో చేరారు. సబ్జెక్టు ఉపాధ్యాయులుగా గుర్తింపు పొందిన వారికి తాత్కాలిక పదోన్నతులలో భాగంగా శుక్రవారం రిలీవింగ్ ఆర్డర్లు ఇచ్చామని ఎంఈఓ శ్రీనివాసరావు తెలిపారు.

పాఠశాలల సందర్శన

మక్కువ: మండలంలోని ములక్కాయవలస మోడల్ పాఠశాల, మక్కువ జెడ్పీహెచ్‌ఎస్, కోన యూపీ పాఠశాలలను పీఎం శ్రీ స్టేట్‌టీం స్పెషల్ ఆఫీసర్, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్టీ చైతన్య, సభ్యులు బృందం, ఉప విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు శనివారం పరిశీలించారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు పరిశీలించారు. పీఎంశ్రీ సెలక్ట్ అయిన పాఠశాలలకు కేంద్రం నిధులు మంజూరు చేస్తుందన్నారు. అలాగే నాడు – నేడు వచ్చే అవకాశముంటుందన్నారు. ఎంఈఓ వి.మల్లేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలు మెచ్చేలా పాలన : పీడిక



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

మెంటాడ: రాష్ట్రంలో ప్రజలు మెచ్చేలా పాలన సాగుతోందని డిప్యూటీ సీఎం, గిరిజన శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని రాబందలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నదీ ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసిన ఏకైక సీఎం జగన్ మోహన్ రెడ్డి అని కొనియాడారు. సచివాలయ వ్యవస్థతో గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం తీసుకువచ్చాడని చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమమే ముఖ్యమంత్రి లక్ష్యమని చెప్పారు. అంతకుముందు రాజన్నదొరకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ సారిక ఈశ్వరరావు, మండల పార్టీ నాయకులు లెంక రత్నాకర్, రెడ్డి రాజప్పలనాయుడు, మెంటాడ, జక్కువ పీఏసీఎస్‌ల అధ్యక్షులు తాడ్డి రామచంద్రరావు, రెడ్డి అప్పారావు, సర్పంచ్ తవుడు, చొక్కాకు సన్యాసినాయుడు, ఎంపీడీఓ త్రివిక్రమ్, తహసీల్దార్ ఆదిబాబు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు భద్రగిరి విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ కమలకుమారి తదితరులు

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు మండలంలోని భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ బాలికల పాఠశాల విద్యార్థినులు ఎం.కీర్తి, ఎ.సలోమి, బి.వైశాలి, ఎం.ప్రభావతి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎం.కమలకుమారి శనివారం తెలిపారు. రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా కేంద్రంలో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఆయా విద్యార్థినులు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయా విద్యార్థినులను ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ షన్ముఖరావు శుభాకాంక్షలు తెలిపారు.

పీహెచ్‌సీలకు చేరిన కోవిడ్ వ్యాక్సిన్లు

మక్కువ: మండలంలోని మక్కువ, శంబర పీహెచ్‌సీలకు 1000డోసులు కోవిడ్ వ్యాక్సిన్లు వచ్చినట్టు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, డాక్టర్ టి.జగన్మోహనరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శంబర జాతర ఈ నెల 23, 24, 25 తేదీలలో జరగనున్నందున, ముందస్తుగా కోవిడ్ వ్యాక్సిన్లు మక్కువ పీహెచ్‌సీకు 500 కోవీషీల్డ్ డోసులు, శంబర పీహెచ్‌సీకు 500కోవీషీల్డ్ డోసులు పంపించామన్నారు.

ఎవరైనా వ్యాక్సిన్ వేసుకుంటామనుకుంటే, ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులును సంప్రదించాలని ఆయన కోరారు.

పాఠశాలలను పరిశీలించిన 'పీఎంఎస్ఆర్ఐ'



బలిజిపేట ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న పీఎంఎస్ఆర్ఐ బృందం సభ్యులు

బలిజిపేట: మండలంలోని గలావల్లి, బలిజిపేట, తుమరాడ, పెదపెంకి మూడో నంబరు పాఠశాలను పీఎంఎస్ఆర్ఐ రాష్ట్ర ప్రత్యేక బృందం శనివారం పరిశీలించింది. గలావల్లి యూపీ పాఠశాల అధ్వానంగా ఉన్నట్టు గుర్తించారు. బలిజిపేట ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల వద్ద తుప్పలు, డొంకలు ఉండడంపై బృందం సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీఎంఎస్ఆర్ఐ రాష్ట్ర ప్రత్యేకాధికారి చైతన్య మాట్లాడుతూ 15 మండలాల్లో 30 పాఠశాలలను ఈ పథకం కింద ఎంపిక చేసినట్టు తెలిపారు. వీటిలో 15 యూపీ, ప్రాథమిక పాఠశాలలు, 15 ఉన్నత పాఠశాలలు, ఇంటర్ విద్యతో ఉండే ఉన్నత పాఠశాలలు ఉన్నాయన్నారు. ఇప్పటికే 12 మండలాల్లో పరిశీలనలు జరిపినట్టు తెలిపారు. పాఠశాలలకు సంబంధించి ఏడు అంశాలపై పరిశీలన చేస్తున్నట్టు తెలిపారు. పాఠశాల ఇన్‌స్ట్రక్చర్, విద్యాపరమైన అంశాలు, మధ్యాహ్న భోజనం, లైబ్రరీ, మరుగుదొడ్లు, ల్యాబ్, ఉపాధ్యాయులు, డిజిటల్ తరగతులు తదితర అంశాలను పరిశీలిస్తున్నామన్నారు. గతంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న పాఠశాలలు మాత్రమే పీఎంఎస్ఆర్ఐ పథకంలోకి వస్తాయన్నారు. వారి వెంట ఉప విద్యాశాఖాధికారి బ్రహ్మజీరావు, ఎంఈఓ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆనాటి జ్ఞాపకాలు పదిలం

- శంబర జాతర విశేషాలు
- నాటుబళ్లతో జాతరకు..
- మూడు రోజులు వంటా.. వార్పు



శంబర పోలమాంబ అమ్మవారు



అమ్మవారు ఘటాలను తిరువీధి నిర్వహిస్తున్న రెవెన్యూ పెత్తందారులు (ఫైల్)



జాతరకు నాటుబండిపై వస్తున్న భక్తులు(ఫైల్)

మక్కువ: జాతరో.. జాతర... శంబర పోలమాంబ జాతరంటే ఎక్కడ లేని సంతోషం. ఒకప్పుడు ఈ జాతరకు వెళ్లాలంటే మూడు రోజుల ముందు నాటుబళ్లతో బయలుదేరి సరిపడ వంట సామగ్రి వెంట బెట్టుకొని ఎంచక్కా కబుర్లు చెప్పుకుంటూ జాతరకు బయలుదేరేవారు. జాతరకు ముందు రోజు గ్రామానికి చేరుకొని గోముఖి నది ఒడ్డున నాటుబళ్లు నిలుపదల చేసి, పంట పొలాల్లో జొన్నకర్రలు సేకరించి అక్కడే వంటకాలు చేసుకొని అక్కడే నిద్రపోయేవారు. మూడు రోజుల పాటు శంబరలో ఉంటూ జాతరను కళ్లారా చూసి అమ్మవారి అనుపోత్సవం అనంతరం కోళ్లు, మేకలు మొక్కుబడులు చెల్లించి వంటలు చేసుకొని ఆరగించి మధ్యాహ్నం స్వగ్రామాలకు నాటుబళ్లపై తిరుగుపయనమయ్యేవారు. అప్పట్లో రహదారుల్లేని రోజుల్లో సమీప గ్రామాల భక్తులు కాలినడకన, నాటుబళ్లతో చేరుకునేవారు. జాతర అప్పట్లో వారం రోజుల పాటు జరిగేది. సాలూరు, బొబ్బిలి, పార్వతీపురం మండలాలకు చెందిన వ్యాపారులు ముందుగా గ్రామానికి చేరుకొని అద్దె ఇళ్లు 10రోజులకు తీసుకునేవారు. అక్కడ వ్యాపారాలు చేస్తూ భక్తులకు కావాల్సిన సమస్త సామగ్రి విక్రయించేవారు. దీంతో జాతర మరింత సందడిగా ఉండేది. అప్పట్లో 20 వేల నుంచి 30 వేల మంది వరకు జాతరకు వచ్చేవారని నాటి వృద్ధులు చెబుతున్నారు.

నేటి పరిస్థితి

ఇప్పుడు మరి పరిస్థితి పూర్తిగా మారింది. రహదారి సౌకర్యాలతో పాటు అన్ని వసతులు ఏర్పాటు కావడంతో భక్తులు జాతరకు ఇలా వచ్చి.. అమ్మవారిని దర్శించుకొని అలా వెళ్లిపోతున్నారు. కేవలం అమ్మవారిని దర్శించుకొని వెళ్లిపోతుండడంతో భక్తుల రద్దీ కనిపించడం లేదు. సిరిమానోత్సవం రోజున మాత్రం సుమారు 2 లక్షల వరకు భక్తులు రావడంతో సందడి నెలకొంటోంది. తొలేళ్ల ఉత్సవం, అనుపోత్సవం రోజున భక్తుల రద్దీ సాధారణంగా ఉంటుంది. పూర్వ ఆచారం ప్రకారం ఇప్పటికీ రెవెన్యూ పెత్తందారులు వారసత్వం నడుస్తుంది. అమ్మవారి ఘటాల అనుపోత్సవం వారి చేతుల మీదనే జరుగుతుండడం విశేషం.

అప్పట్లో జాతర సాగేదిలా..

శంబర పోలమాంబ అమ్మవారు జాతర 1982 సంవత్సరానికి ముందు గ్రామ మునసబు, పూజారి కుటుంబీకులు, కొండదొర కులస్తులు, గిరడవారు, పొడుపురెడ్డివారు, తీళ్లవారు, కరణం కుటుంబీకులు రెవెన్యూ పెత్తందారులుగా వ్యవహరించేవారు. అప్పట్లో ప్రతి ఇంటికి 2, 5, 10రూపాయిలు చొప్పున (రైతులకు ఉన్న పశువులు యేర్లును బట్టి) చందాలు వసూలు చేసి పండుగ జరిపించేవారు. జాతరకు వచ్చిన భక్తుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు భాగవతం(నాటకం) వేయించేవారు. నాటకం వేసిన కళాకారులకు భోజనం కోసం వంట సామగ్రిని గ్రామానికి చెందిన షావుకార్లు అందించేవారు. నాటకాన్ని గ్రామంలో కమీషన్ పాట ద్వారా వచ్చిన సొమ్ముతో వేయించేవారు. 1982 సంవత్సరంలో శ్రీకాకుళం దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌ను గ్రామానికి చెందిన యువజన యూత్ సభ్యులు కలిసి శంబర జాతర ఎండోమెంట్ ఆధ్వర్యంలో జరిపించాలని కోరారు. అప్పటి నుంచి దేవదాయశాఖ ఆధ్వర్యంలో జాతర జరుపుతున్నారు. 1982లో ఆలయ కమిటీ ఏర్పాటు జరిగింది. అక్కడ నుంచి ఏటా జాతరలో వచ్చిన ఆదాయంతో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. 2004లో అమ్మవారు ఆలయం నిర్మించారు.

ఆ రోజులే వేరు...



అప్పటి రోజులు మరి చిపోలేనివి. వారం రోజులు పాటు జాతర ఎంతో ఘనంగా జరిగేది. జాతర ముందు నుంచి బంధువులతో గ్రామం నిండిపోయేది. భాగవతం నాటకం మూడు రోజులు పాటు నిర్వహించేవాళ్లు.

– గొర్లె గురువులు, శంబర

అమ్మవారిపై నమ్మకం పెరిగింది



గతంలో పోల్చితే ఇప్పుడు భక్తులకు అమ్మవారిపై నమ్మకం, విశ్వాసం పెరిగింది. ఏటా గ్రామంలో నిర్వహిస్తున్న సిరిమానోత్సం కార్యక్రమానికి లక్షలాది మంది భక్తులు గ్రామానికి చేరుకోవడం చూస్తుంటే ఆనందమేస్తుంది. అమ్మవారు దయ వల్ల మా గ్రామానికి పేరుప్రఖ్యాతులు లభించాయి.

– పూడి దాలినాయుడు (ట్రస్ట్ బోర్డు చైర్మన్)

నాటుబళ్లుతో గ్రామం నిండేది



గతంలో జాతర రెవెన్యూ పెత్తందారుల ఆధ్వర్యంలో జరిగేది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు నాటుబళ్లతో చేరుకునేవారు. గ్రామంలోని ఇరువైపులా నాటుబళ్లు ఉండేవి. నాలుగు రోజుల పాటు భక్తులు గ్రామంలో ఉండేవారు. వంటలు చేసుకొని గ్రామంలో ఉండేవారు.

– నైదాన లచ్చమ్మ, శంబర